క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

ఉయ్యాలవాడ : మండలంలో జగనన్న లేఅవుట్ కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని హౌసింగ్ ఏఈ నరసింహరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సర్వాయిపల్లె, ఆర్.పాంపల్లె, ఇంజేడు, ఉయ్యాలవాడ గ్రామాల్లో లేఅవుట్ కాలనీల్లో కేవలం కొంత మంది మాత్రమే నిర్మాణాలు చేపట్టారని మిగిలిన వారు నిర్మాణాలు ప్రారంభించాలని కోరారు. నిర్మాణాలు చేపట్టిన ప్రతి లబ్ధిదారునికి నిర్మాణ దశలను బట్టి ప్రభుత్వం వారి వ్యక్తిగత ఖాతాల్లో బిల్లులు జమ చేస్తుందని చెప్పారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(సిటీ): పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి వైద్య, పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం పట్టణంలోని 34వ వార్డులో డెంగీ కేసు నమోదైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలను అరికట్టడానికి ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలని సూచించారు.

నేడు గంధం, రేపు ఉరుసు



విద్యుద్దీపాలంకరణలో శ్రీబందెషావలి, శ్రీదస్తగిరి స్వామి దర్గాలు

చాగలమర్రి: స్థానిక పెద్దమకానం వీధిలో వెలసిన శ్రీదస్తగిరి స్వామి, శ్రీబందెషావలి స్వామి, శ్రీ షాబుషా వలి స్వాముల వారి ఉత్సవాల సందర్భంగా గురువారం గంధం, శుక్రవారం ఉరుసు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు బుధవారం తెలిపారు. గురువారం రాత్రి వైఎస్సార్ జిల్లా, కమలాపురంలోని దర్గా–ఏ–గఫ్ఫారియా ఖలీఫా మౌలానా ఫైజుల్ ఖాదర్ షా ఖాద్రి స్వామి వారి ఆధ్వర్యంలో గంధం మహోత్సవం ఫక్కీర్ల మేళతాళాలతో, ప్రధాన వీధుల్లో తీసుకొని దర్గా చేసుకుంటారు. దాతలు ముల్లా షబ్బీర్ అహమ్మద్ , ముల్లా అజిమొద్దీన్, లాలుసాబ్, హనీఫ్, రసూల్ ఆధ్వర్యంలో శుక్రవారం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారని కమిటీ సభ్యుడు ఎస్ మహబూబ్ బాషా తెలిపారు. ఉరుసు రోజు రాత్రి మైసూర్, బెంగళూరుకు చెందిన తౌసిక్ ఖాద్రీ, అర్షియానాజ్‌తో ఖవ్వాళి కార్యక్రమం ఉంటుందని చెప్పారు.


పంచాయతీ కార్యదర్శి స్థానికతపై విచారణ



డిప్యూటీ సీఈఓ చేపట్టిన విచారణలో పాల్గొన్న అధికారులు, గ్రామపెద్దలు

నంద్యాల(అర్బన్): మండలంలోని కానాల మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు స్థానికతపై డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గ్రామ పెద్దల సమక్షంలో విచారణ చేపట్టారు. 2022లో గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన శ్రీనివాసులు స్థానికంగా ఉండటం లేదంటూ గ్రామస్తుడు మునీర్ బాషా ఆర్టీఐ ద్వారా సమాచారం కోరారు. పంచాయతీ కార్యదర్శి స్థానికతపై అప్పట్లో డీపీఓ విచారణ జరిపారు. సరైన సమాచారం రాలేదంటూ మునీర్ బాషా కోర్టులో రిట్ దాఖలు చేశారు. దీంతో పూర్తి విచారణకు డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఈఓ ఆర్డీలు వెంకటేశ్వర్లు, మహీధర్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ షాను, పంచాయతీ కార్యదర్శులు సరళమ్మ, నరేంద్రలతో పాటు గ్రామపెద్దల ఆధ్వర్యంలో విచారణ జరిపారు. విచారణ నివేదికలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తెలిపారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా హృదయరాజు



హృదయరాజును అభినందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల (న్యూటౌన్): ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా హృదయరాజు ఎంపికపై నంద్యాల జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేస్తూ అభినందించినట్లు సంఘం నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవస్వామి, నగిరి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో హృదయరాజును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. ఏపీ జేఏసీగా ఉంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమ పోరాటాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. మిడుతూరు మండలం కలబందపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా హృదయరాజు పనిచేస్తున్నారన్నారు. అలాగే రాష్ట్ర కార్యదర్శిగా నంద్యాల జిల్లా నుంచి మధుసూదన్‌రావు, సాంబశివుడును ఎన్నుకోవడంపై అభినందనలు తెలిపారు. బత్తుల రవికుమార్, జయరామ్, గోవిందనాయక్, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, లింగమయ్య పాల్గొన్నారు.

నిత్యం నిఘా

- ప్రశాంత కౌంటింగ్ లక్ష్యంగా పోలీసుల చర్యలు
- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా
- అసాంఘిక శక్తులపై డేగకన్ను
- లెక్కింపు రోజు అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు
- మాబ్ ఆపరేషన్, మాక్ డ్రిల్, కవాతులతో ప్రజల్లో అవగాహన
- అనుమానిత ప్రాంతాల్లో కార్డన్‌సెర్చ్



పట్టణంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

ఆళ్లగడ్డ: ఎన్నికల కౌంటింగ్.. ప్రస్తుతం పోలీసుల ముందున్న అతిపెద్ద సవాల్. చెదురు మదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసినా.. ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలతో కౌంటింగ్ రోజు, ఆ తరువాత కొంత ఇబ్బందికర పరిణామాలు తలెత్తే అవకాశముందని నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాల్లో బైండోవర్ అయిన వారు, రౌడీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా తీవ్రం చేయడంతో పాటు అనుమానితులపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించింది. దీంతో పోలీసులు ఆ మేరకు చర్యలు ముమ్మరం చేశారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

పోలింగ్ రోజున జరిగిన ఉద్రిక్తతలు, అల్లర్లు దృష్టిలో పెట్టుకొని జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలో పలు సమస్యాత్మక గ్రామాలను పోలీసులు గుర్తించారు. ఆయా గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, రాజకీయ పార్టీల నాయకులతో చర్చించారు. 21 అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో గొడవలు జరిగే అవకాశం ఉందని గుర్తించడంతో జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా పికెట్‌లు ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఎక్కడైనా సమస్య ఏర్పడుతుందన్న అనుమానం ఉన్న గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్, సెర్చ్ ఆపరేషన్, ఇతర ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. ప్రధానంగా ఫ్యాక్షన్ , ముఠా కక్షలు, వర్గ కక్షలు ఉన్న గ్రామాల్లోనూ నాలుగు విభాగాలుగా విభజించి అందుకు అనుగుణంగా బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. పోలింగ్ సమయంలో, తదనంతరం జరిగిన ఘటనలుకు సంబంధించి పలువురిని బైండోవర్ చేశారు. ఇద్దరిపై రౌడీషీట్ తెరిచారు. గ్రామాల్లో చదువుకున్న యువతతోపాటు గ్రామస్తులకు.. గొడవల వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ చైతన్యవంతులను చేస్తున్నారు.

అక్రమాల నిరోధానికి చెక్‌పోస్టులు..

సబ్‌డివిజన్ పరిధిలో అంతర్ జిల్లాల చెక్‌పోస్టులను 5 ఏర్పాటు చేసి, ఎక్కడికక్కడ కేంద్ర ప్రత్యేక పోలీస్ బలగాల ద్వారా వాహన తనిఖీలు చేపడుతున్నారు. చిన్నపాటి సమాచారం వచ్చినా సత్వరమే దాడులు చేస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

450 మందికి నోటీసులు..

ఎన్నికల సందర్భంగా 150 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి గొడవలు సృష్టించే వారిని ముందస్తుగా బైండోవర్ చేశారు. ఎన్నికల ముందు సుమారు 4 వేల మందిని, ఎన్నికల అనంతరం 50 మందిని బైండోవర్ చేశారు. వీరితో పాటు ఏదైనా అవాంఛనీయ సంఘటన చోటుచేసుకుంటే వారిపై కేసు నమోదు చేయడంతోపాటు ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష చొప్పున జరిమాన వసూలు చేసేలా 450 మంది వివిధ పార్టీలకు చెందిన గ్రామ నాయకులకు నోటీసులు జారీచేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వీరి వివరాలను ఆర్వోలు, తహసీల్దార్‌ల దృష్టికి తీసుకెళ్లి నోటీసులు పంపేలా చర్యలు చేపట్టారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా ఉంచి వారి ప్రతి కదలికలను గమనిస్తున్నారు. ఇప్పటికే వారికి పలు మార్లు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరప్రవృత్తి కలిగిన కొందరు పాత నేరస్తులను కౌంటింగ్ కంటే ముందు రోజు సాయంత్రం నుంచి అదుపులోకి తీసుకుని 6వ తేదీ సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్‌లలో ఉంచుతామని పోలీసులు చెబుతున్నారు.



చింతకుంటలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

90 గ్రామాల్లో కార్డన్ సెర్చ్ ..

సబ్ డివిజన్ పరిధిలోని పట్టణాలతో పాటు గ్రామాల్లో సీఐలు, ఎస్సైలు ఇతర సిబ్బందితో 90 అనుమానిత గ్రామాల్లో కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఇప్పటికీ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో పరిశీలన ఇంకా కొనసాగుతోంది.

ఘర్షణలకు తావు లేకుండా..

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఘర్షణలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. జూన్ 4న, అనంతరం విజయోత్సవాలు, ర్యాలీలు, సంబరాలు, బాణాసంచా కాల్చడం, డీజే, మైకులు, లౌడ్‌స్పీకర్లు పెట్టడం వంటి వాటికి అనుమతి లేదని ప్రకటించారు. సెక్షన్ 144 అమల్లో ఉన్నందున ప్రజలు గుమికూడి ఉండకూడదు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయి. అల్లర్లు సృష్టిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. సమస్య ఏర్పడిన ఏ ప్రాంతమైనా 5–10 నిమిషాల్లో చేరుకునేలా ప్రత్యేక పోలీస్ బృందాలను అందుబాటులో ఉంచారు.

ప్రశాంత వాతావరణానికి చర్యలు చేపట్టాం



ప్రజలు స్వేచ్ఛగా, గ్రామాలు ప్రశాంత వాతావరణంలో ఉండేలా అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా గొడవలు జరగకుండా ఓట్ల లెక్కింపు రోజు ప్రశాంతంగా ఉండేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. సబ్‌డివిజన్ పరిధిలోని బనగానిపల్లె, ఆళ్లగడ్డ నియోజకవర్గాల పరిధిలో మిలటరీ, సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్‌పీ, ఇతర కేంద్ర బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులతో పాటు కేసులున్న వారి పట్ల నిరంతరం నిఘా కొనసాగిస్తూనే రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి బైండోవర్ చేస్తున్నాం. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రశాంత వాతావరణానికి కృషి చేస్తున్నాం. నేరాల నియంత్రనకు 21 పోలీస్ పికటింగ్‌లు, 5 చెక్‌పోస్టులు, 6 షాడో టీంలను ఏర్పాటు చేశాం. పలు పార్టీలకు చెందిన వంద మంది వరకు బైండోవర్ చేశాం.

– షర్ఫుద్దీన్, డీఎస్పీ, ఆళ్లగడ్డ



రాజకీయ పార్టీల నాయకులకు అంజేస్తున్న నోటీసులు

అల్లర్లకు పాల్పడితే చర్యలు



ఆలమూరు వాసులతో మాట్లాడుతున్న సీఐలు

రుద్రవరం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న తరుణంలో అల్లర్లకు పాల్పడవద్దని సీఐలు చంద్రబాబు, హనుమంత్‌నాయక్ ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో పర్యటించి సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అలాగే గ్రామంలో పోలీస్ కవాతు చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయని, గ్రామాల నుంచి లెక్కింపు కేంద్రాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. అలాగే ఫలితాలు పూర్తయ్యే వరకు 144 సెక్షన్, 30యాక్ట్ అమలులో ఉంటుందని, గుంపులుగా ఉండొద్దని చెప్పారు. ఫలితాలు వెలువడగానే విజయోత్సవ సంబరాలు చేసుకోవద్దని, అందరూ శాంతియుతంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులు సమాచారం ఇవ్వాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే శాఖపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని 12 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐలు నిరంజన్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

కుమార స్వామికి షష్టి పూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో షష్టిని పురస్కరించుకుని బుధవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్ర పారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ఆళ్లగడ్డ: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం ఎంపీడీఓ రమణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి చర్చించి తక్షణం ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై తీసుకోవల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొత్త నీరు వచ్చి చేరుతుందని, గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులను క్లోరినేషన్ చేయించిన తరువాతే నీటిని సరఫరా చేసేలా చూడాలని చెప్పారు. జెడ్పీటీసీ లక్ష్మీదేవి, ఉప మండలాధ్యక్షులు ప్రసాద్, దాదాపీర్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఏపీఓ రవిప్రకాష్

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ రవిప్రకాష్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో 9,800 మంది వ్యవసాయ కూలీలు ఉండగా ప్రస్తుతం రోజు 2,400 మంది పనుల్లో పాల్గొంటున్నారన్నారు. ప్రభుత్వం రోజుకు 5వేల మందికి పనులు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. పెంచిన వేతనం రూ.300పై కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గాయని కూలీల సంఖ్య పెంచడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం వంద ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసేందుకు సన్న, చిన్నకారు రైతులకు వంద శాతం సబ్సిడీతో ప్రోత్సహిస్తోందన్నారు. ఇప్పటి వరకు పెద్దయమ్మనూరు, ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు, తుడుమలదిన్నె, సుద్దమల్ల, రూపనగుడి, సర్వాయిపల్లె, ఆర్.జంబులదిన్నె గ్రామాలలో 73 ఎకరాలు గుర్తించినట్లు చెప్పారు. కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలి

గోస్పాడు: ఉపాధి పనుల్లో నాణ్యత ఉండేలా పనులు చేయించాలని సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని రాయపాడు, సాంబవరం, దీబగుంట్ల గ్రామాల్లో చేసిన ఉపాధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను బుధవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కూలీలు నిర్దేశించిన కొలతల మేరకు పనులు చేయాలని చెప్పారు. ఆయా గ్రామాల్లో చేసిన పనులు ఎంతమేరకు చేశారో, పనుల్లో నాణ్యతలపై క్వాలిటీ సరిచూస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో పంటకాలువల్లో చేపట్టిన పనులను అధికారులు తనిఖీ చేసి కొలతలు వేసి రికార్డులు పరిశీలించారు. ఈసీ మహేష్ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



పని ప్రదేశంలో కొలతలు వేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

‘ఆసరా’ చెల్లింపులు పూర్తి

శిరివెళ్ల: ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం కింద డ్వాక్రా సంఘాల మహిళలకు రుణమాఫీని వంద శాతం పూర్తి చేసింది. గత నాలుగేళ్లలో 3 విడతలు చెల్లించగా ఈ ఏడాది ఫిబ్రవరిలో 4వ విడత చెల్లింపునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎన్నికల కోడ్ ముందు మండలంలో 70 శాతం సంఘాలకు చెల్లింపులు జరిగాయి. కోడ్ అమలులోకి రావడంతో మిగిలిన 30 శాతం చెల్లింపులు ఆగిపోయాయి. పోలింగ్ అనంతరం ప్రభుత్వం మిగిలిన 30 శాతం సొమ్మును ఈ నెలలో చెల్లించింది. 4వ విడతలో 972 సంఘాల్లోని మహిళలకు రూ.8.31 కోట్లను గ్రామైక్య సంఘాల ఖాతాల్లో జమ చేసింది.



ఆసరా వారోత్సవాల్లో పాల్గొన్న మహిళలు (ఫైల్)

గ్రామాల వారీగా చెల్లింపులు ఇలా..

గ్రామం	సంఘాలు	నగదు (రూ.ల్లో)
శిరివెళ్ల	314	3.24 కోట్లు
యర్రగుంట్ల	156	1.02 కోట్లు
గోవిందపల్లె	125	1.24 కోట్లు
బోయలకుంట్ల	50	45 లక్షలు
చెన్నూరు	73	66.52 లక్షలు
గంగవరం	41	26.67 లక్షలు
గుంప్రమాన్‌దిన్నె	57	33.47 లక్షలు

గ్రామం	సంఘాలు	నగదు (రూ.ల్లో)
గుండంపాడు	34	15.43 లక్షలు
జీనేపల్లె	16	72.55లక్షలు
కామినేనిపల్లె	20	15.78 లక్షలు
కోటపాడు	44	40.40 లక్షలు
మహదేవపురం	35	11.93 లక్షలు
వనికినిదిన్నె	7	4.71 లక్షలు

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

- స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ
- భద్రత, సీసీ కెమెరాల ఏర్పాట్లపై ఆరా
- పార్కింగ్, ఇతర సౌకర్యాలపై సమీక్ష



సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్ రెడ్డి

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పక్కా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అధికారులు వెల్లడించారు. జిల్లాలోని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల సామగ్రి, ఈవీఎంలు భద్రపరిచిన ఆర్జీఎం, శాంతిరామ్, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లను నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాల గార్డులు, జిల్లా ఆర్మ్‌డ్ పోలీసులు, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భద్రతా సిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా చూసుకోవాలన్నారు. కౌంటింగ్ రోజున ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో పహారా ఉంటుందని వివరించారు. అలాగే జిల్లావ్యాప్తంగా పోలీసు పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజకీయ పార్టీల విజయోత్సవ సంబరాలు, బహిరంగ కేక్ కటింగ్‌లు, ర్యాలీలపై నిషేధం ఉందని ఎవరూ నిబంధనలు ఉల్లంఘించరాదన్నారు. ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా ఏ చిన్న సంఘటన జరిగినా తక్షణమే పోలీసుకు సమాచారం ఇవ్వాలన్నారు. అసాంఘిక శక్తులు, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. అలాగే గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా గ్రామ సభల ద్వారా పోలీసులచే అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎస్బీ డీఎస్పీ సంతోష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ వెంకటేశ్వరరావు, పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్ఐ అశోక్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయ పనులు ముమ్మరం



దొర్నిపాడు వద్ద గత పంట అవశేషాలను తగలబెట్టిన కూలీలు

దొర్నిపాడు: మరో రెండు రోజుల్లో జోరు వానలు కురవనున్నాయనే వాతావరణ శాఖ చెబుతుండటంతో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు సేద్యాలు చేశారు. పొలాల్లో ఉన్న గత పంట అవశేషాలను ప్రస్తుతం తొలగిస్తున్నారు. కొందరు వాటిని పొలంలోనే తగలబెడుతున్నారు. ఇప్పటికే చాలా మంది ఖరీఫ్ పంటల సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. మరికొందరు అదునైన వర్షాలు కురిస్తే ముందస్తు పంటలు సాగు చేసేందుకు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుంటున్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

రుద్రవరం: మండలంలోని ఆలమూరుకు చెందిన దేవదాసు (31) అనే వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. దేవదాసు కొన్ని నెలల క్రితం తాటిముంజలు తెచ్చేందుకు వెళ్లి చెట్టుపై నుంచి కిందపడ్డాడు. తీవ్ర గాయాల పాలవడంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలు చేయించారు. ఆరోగ్యం కాస్త కుదుట పడగానే వైద్యశాల నుంచి ఇంటికి చేరుకున్నాడు. అయితే గాయాల బాధలు తాళలేక మనస్తాపం చెంది రెండు రోజుల క్రితం కల్లాపు చల్లే రంగుపొడిని సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబు సభ్యులు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించినప్పటికీ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారెడ్డి

దొర్నిపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో నిర్వాహకులు నాణ్యత పాటించాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి సూచించారు. 2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించి మధ్యాహ్న భోజనం మరింత నాణ్యత, రుచికరంగా వండేందుకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం వంట మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం సిద్ధం చేయాలన్నారు. నాణ్యతగా వంటలను వండాలని ముఖ్యంగా వంట పాత్రలను ప్రతి రోజూ శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ఏదైనా సమస్యలుంటే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వెంటనే తెలియజేయాలన్నారు. ఎంఈఓలు అబ్దుల్‌కరీం, రామచంద్రయ్య, సీఆర్‌పీ శివకుమార్ పాల్గొన్నారు.